# విశ్వక్‌సేన్ పార్టీ థ్రిల్లర్ #CULT



హీరో విశ్వక్‌సేన్ ముచ్చటగా మూడో సారి మెగా ఫోన్ పట్టారు. ఆయన ఇప్పటికే ఫలక్‌నామా దాస్, దాస్ కా ధమ్కీ చిత్రాలకు దర్శకత్వం వహించిన విషయం తెలిసిందే. ఆ సినిమాలతో కేవలం హీరోగా, దర్శకునిగానే కాక, నిర్మాతగా, రచయితగా కూడా విశ్వక్‌సేన్ సత్తా చాటారు. ఇప్పుడు ఆయన దర్శకత్వంలో 'కల్ట్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కనున్నది. ఈ సినిమా ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కెమెరా స్విచాన్ చేయగా, అగ్ర నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ ఇచ్చారు. మరో నిర్మాత ఎస్.రాధాకృష్ణ(చిన బాబు) టైటిల్ లోగోను లాంచ్ చేశారు. అతిథులంతా చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. 40మంది కొత్త నటీనటులు ఈ సినిమా ద్వారా పరిచయం అవుతున్నారని, విశ్వక్‌సేన్ విజన్‌కు మద్దతిచ్చే అనుభవజ్ఞులైన టెక్నీషియన్స్ ఈ సినిమాకు పనిచేస్తున్నారని, న్యూ ఏజ్ పార్టీ థ్రిల్లర్‌గా, వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందుతున్నదని, ట్రెడిషనల్ ఫార్ములాలను చెరిపేసేలా సినిమా ఉంటుందని, ఈ రోజు నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెలుగు, హిందీ, జపనీస్, స్పానిష్, ఇంగ్లిష్ భాషల్లో సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: తరుణ్‌భాస్కర్, సంగీతం: రవి బస్రూర్, కెమెరా: అర్విండ్ విశ్వనాథ్, నిర్మాతలు: కరాటే రాజు, సందీప్ కాకర్ల, నిర్మాణం: తారక్ సినిమాస్, వన్మయే క్రియేషన్స్.



# అదే నిజమైతే.. టైమ్ మొదలైనట్టే..

'రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్' సినిమాతో యువతరం హృదయాలను బరువెక్కించింది కథానాయిక కయాదు లోహర్. అస్సాంకి చెందిన ఈ వయ్యారి ఇప్పటికే కన్నడ, మలయాళ, మరాఠీ భాషల్లో మెరిసింది. తెలుగులో శ్రీవిష్ణుతో చేసిన 'అల్లూరి' చిత్రం కయాదు లోహర్‌కి అంత కలిసి రాలేదు. అయితే.. తాజా సమాచారం ప్రకారం, ఓ అద్భుతమైన తెలుగు సినిమా అవకాశం ఈ అందాల భామ తలుపు తట్టిందని తెలుస్తున్నది. వివరాల్లోకెళితే.. 'హిట్ 3' సక్సెస్‌తో మంచి జోష్ మీదున్న నాని, త్వరలో 'ప్యారడైజ్' సెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. 'దసరా'ఫేం శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కథానాయిక ఖరారు కాలేదు. అయితే.. ఇందులో కయాదు లోహర్ కథానాయికగా ఎంపికైందని విశ్వసనీయ సమాచారం. కథలో కథానాయిక పాత్ర కీలకమట. ఆ పాత్రకు కయాదు కరెక్ట్ అని దర్శకుడు శ్రీకాంత్ భావించారట. ఇటీవలే కథ కూడా వినిపించారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సివుంది. ఇదే నిజమైతే.. టాలీవుడ్లో కయాదు లోహర్ టైమ్ మొదలైనట్టే.

# భాగ్యనగరంలో భారీ యాక్షన్?



హీరోలకు అభిమానులుండటం సహజం. అలాగే కొన్ని సినిమాలక్కూడా ప్రత్యేకంగా ఫ్యాన్సుంటారు. అలా సపరేట్ ఫ్యాన్‌ని ఏర్పరచుకున్న సినిమాల్లో 'అఖండ' ఒకటి. ఈ సినిమాకు సీక్వెల్ వస్తుందనగానే ఆడియన్స్‌లో అంచనాలు అంబరాన్ని తాకాయి. మొన్నటివరకూ ఈ సినిమాను దసరా కానుకగా విడుదల చేస్తామని నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట చెబుతూ వచ్చారు. ఇప్పుడు మీడియాలోనేమో 'అఖండ -తాండవం' సంక్రాంతికి షిఫ్టయ్యిందనే వార్తలు వినిపిస్తున్నాయి. మరి వాస్తవం ఏంటో తెలియాల్సివుంది. ఈ సినిమా షూటింగ్ రీసెంట్‌గా జార్జియాలో జరిగింది. వచ్చే నెల తొలివారం నుంచి కొత్త షెడ్యూల్‌ని దర్శకుడు బోయపాటి శ్రీను ప్లాన్ చేస్తున్నారు. ఈ షెడ్యూల్‌లోనే ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా బోయపాటి చిత్రీకరిస్తారట. దీనికోసం హైదరాబాద్‌లో ఓ భారీ సెట్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు. హీరో బాలకృష్ణ, మిగతా తారాగణం, దాదాపు వేయిమంది జూనియర్ ఆర్టిస్టులు ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో పాల్గొంటారని సమాచారం. సినిమాకే హైలైట్‌గా ఈ సీక్వెన్స్ ఉండబోతున్నదని తెలుస్తున్నది. 14రీల్స్ ప్లస్ పతాకంపై రూపొందుతోన్న ఈ పాన్ ఇండియా చిత్రంలో ఆది పినిశెట్టి, సంయుక్తా మీనన్, కావ్య థాపర్, జగపతిబాబు, ఎస్.జె.సూర్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్.థమన్.



# డుమ్ డుమారే.. దుమ్ము రేగి పోవాలిలే..

బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ హీరోలుగా రూపొందుతోన్న యాక్షన్ థ్రిల్లర్ 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ఈ నెల 30న సినిమా విడుదల కానుంది. ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ఈ క్రమంలో ఈ సినిమా నుంచి మూడో పాటను ఆదివారం విడుదల చేశారు. 'డుమ్ డుమారే.. దుమ్ము రేగి పోవాలిలే..' అంటూ సాగే ఈ పాటను భాస్కరభట్ల రవికుమార్ రాయగా, శ్రీచరణ్ పాకాల స్వరపరిచారు. రేవంత్, సాహితి చాగంటి ఆలపించారు. గణేష్ మాస్టర్ పాటకు కొరియోగ్రఫీని అందించారు. బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్‌లపై ఈ పాటను చిత్రీకరించారు. వారి పాత్రల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీని, వారి స్నేహబంధాన్నీ ఈ పాట అద్దం పట్టిందని చెప్పొచ్చు. స్నేహానికి సరైన అర్థం చెప్పేలా సాహిత్యం సాగింది. అదితి శంకర్, దివ్యా పిళ్లై కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు: సత్యర్షి, తూమ్ వెంకట్, కెమెరా: హరి కె.వేదాంతం, సమర్పణ: డా.జయంతిలాల్ గడా.



# ఏ థ్రిల్లర్‌లోనూ కనిపించని యూనిక్ కాన్సెప్ట్‌తో..

నవీన్‌చంద్ర కథానాయకుడిగా నటించిన బైలింగ్వల్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఎలెవన్'. లోకేశ్ అజ్ల్స్ దర్శకుడు. అజ్మల్‌ఖాన్, రేయా హరి నిర్మాతలు. ప్రముఖ పంపిణీదారుడు ఎన్.సుధాకర్‌రెడ్డి ఈ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. ఈ నెల 16న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హీరో సందీప్ కిషన్ చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ 'నేను ఎన్నుకునే కథలు బావుంటాయని అందరూ అంటారు. ఆ నమ్మకాన్ని రెట్టింపు చేస్తుందీ సినిమా. నిర్మాతలు ఎంతో పాషన్‌తో సినిమా తీశారు. ఆడియన్స్‌కి గ్రేట్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో అందరం చాలా హార్డ్‌వర్క్ చేశాం. ఇప్పటివరకూ ఏ థ్రిల్లర్‌లోనూ కనిపించని యూనిక్ కాన్సెప్ట్ ఇది. సాంకేతికంగా చాలా రిచ్‌గా ఉంటుందీ సినిమా.' అని తెలిపారు. ఇంకా చిత్ర దర్శకుడు లోకేష్ అజ్ల్స్, కథానాయిక రియా, నటి అభిరామి, సంగీత దర్శకుడు డి.ఇమాన్‌లతోపాటు అతిథులుగా విచ్చేసిన దర్శకులు సాయిరాజేష్, కరుణకుమార్, శ్రీకాంత్ నాగోతి, అనిల్ విశ్వనాథ్, రచయిత లక్ష్మీభూపాల, గీత రచయిత రాకేందుమౌళి కూడా మాట్లాడారు.

# యాక్షన్ ప్యాక్డ్ బైలింగ్వల్‌లో



రాజ్‌తరుణ్ కథానాయకుడిగా ద్విభాషా చిత్రం తెరకెక్కనున్నది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్, దర్శకుడు విజయ్ మిల్టన్ ఈ సినిమాకు దర్శకుడు. ఆయన దర్శకత్వంలోనే వచ్చిన 'గోలీసోడా' ఫ్రాంచైజీలో భాగంగా ఈ చిత్రం రూపొందనున్నది. ఆదివారం రాజ్‌తరుణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలియజేశారు. రఫ్‌నోట్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందనున్న ఈ సినిమాలో రాజ్ తరుణ్ కంప్లీట్ న్యూ అవతార్‌లో కనిపిస్తారని, ఆడియన్స్ సర్‌ప్రైజ్ అయ్యేలా వైవిధ్యంగా, న్యూ షేడ్స్‌తో హీరో కేరక్టరైజేషన్ ఉంటుందని, యాక్షన్ ప్యాక్‌డ్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో కథ, కథనాలు స్ట్రాంగ్‌గా ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో ఈ చిత్రం రూపొందనున్నట్టు వారు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో తెలుస్తాయి.



# మిత్రుడితో మమితా బైజు

లవ్ టుడే, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్ చిత్రాలతో తమిళంతోపాటు తెలుగులోనూ మంచి క్రేజ్‌ని సాధించారు హీరో ప్రదీప్ రంగనాథన్. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ ఆయనతో 'డ్యూడ్' పేరుతో ఓ పానిండియా చిత్రాన్ని నిర్మిస్తున్నదంటే కారణం అదే. 'ప్రేమలు'ఫేం మమిత బైజూ ఇందులో కథానాయిక. కీర్తిశ్వరన్ దర్శకుడు. శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. శనివారం విడుదల చేసిన ప్రదీప్ రంగనాథన్ ఫస్ట్‌లుక్‌కి ఆడియన్స్ నుంచి మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో ఆదివారం కథానాయిక మమితా బైజుకు సంబంధించిన లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ప్రదీప్‌కు పర్‌ఫెక్ట్ జోడీగా మమితా బైజు కనిపిస్తున్నది. ఒకవైపు ప్రదీప్ స్మైల్‌తో రిలాక్స్‌గా కనిపిస్తుంటే.. మమిత స్టైలిష్ దుస్తులు ధరించి, గాగుల్స్‌తో ఫ్యాషన్ స్టేట్మెంట్ ఇస్తున్నది. షూటింగ్ శరవేగంగా జరుగుతున్నదని, దీపావళి కానుకగా సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. హృదు హరూన్, ద్రవిడ్ సెల్వం తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి, సంగీతం: సాయి అభ్యంకర్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్.



కొన్ని సినిమాలు నటీనటుల మనస్తత్వాల్లో కూడా మార్పును తెస్తుంటాయి. 'కేసరి 2' సినిమా వల్ల నటి అనన్య పాండేకు అలానే జరిగిందట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో

# ఇక అలాంటి పాత్రలు చేయను

తనలో వచ్చిన మార్పు గురించి అనన్య మీడియాతో మాట్లాడింది. 'కెరీర్ తొలినాళ్లలో ఎలాంటి పాత్రలు ఎంచుకోవాలో తెలిసేది కాదు. అందుకే అన్నీ బబ్లీ కేరక్టర్లే చేశాను. అందులో కామెడీ, గ్లామర్ పాత్రలే ఎక్కువ. అయితే.. రీసెంట్‌గా 'కేసరి 2'లో నటనకు ఆస్కారమున్న మంచి పాత్ర చేశాను. ఆ పాత్రలో నన్నునేను చూసుకున్న తర్వాత నటిగా నాలో చాలా మార్పు వచ్చింది. ముఖ్యంగా ఎలాంటి కథలు ఎంచుకోవాలో తెలిసొచ్చింది. 'కేసరి 2'లో నేను చేసిన పాత్ర నాకొక సవాల్. నటిగా నా పొటెన్షియాలిటీని తెలియజెప్పిందా పాత్ర. ఇకనుంచి సునాయాసంగా నటించగలిగే పాత్రల్ని చేయను. సవాలు విసిరే పాత్రలే చేస్తా. అవకాశాలు తగ్గినా పర్లేదు.' అంటూ చెప్పుకొచ్చింది అనన్య పాండే.



# వంచించబడ్డ ఆత్మ విలయ తాండవం..

సుధీర్‌బాబు కథానాయకుడిగా ప్రతిష్ఠాత్మక పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ పతాకంపై ఓ చిత్రం రూపొందనున్నది. ఆర్.ఎస్.నాయుడు ఈ చిత్రానికి దర్శకుడు. ఆదివారం సుధీర్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఈ తాజా సినిమాకు సంబంధించిన ప్రకటనను మేకర్స్ విడుదల చేశారు. వైవిధ్యమైన కథ, కథనాలతో ఈ చిత్రం రూపొందనున్నదని వారు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో సుధీర్‌బాబు షర్ట్ లేకుండా, కండలు తిరిగిన దేహంతో.. ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నారు. మెట్లపై మృత దేహాలు పడివుండగా.. సుధీర్‌బాబు ఆయుధంతో నడుచుకుంటూ వెళ్తూ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. 'A Broken Soul On A Brutal Celebration' అనే ట్యాగ్‌లైన్ ఇందులోని సుధీర్‌బాబు క్యారెక్టర్ డెప్త్‌ని తెలియజేస్తున్నది. సర్వైవల్ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ చిత్రానికి నిర్మాతలు: టి.జి.విశ్వప్రసాద్, కృతి ప్రసాద్.

# అమ్మ ప్రేమను చాటే ఫ్రై డే

దియా రాజ్, ఇనయా సుల్తానా, రిహానా, వికాస్, వశిష్ట, రోహిత్ బొడ్డపాటి ప్రధాన పాత్రధారులుగా రూపొందుతోన్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫ్రై డే'. ఈశ్వర్‌బాబు ధూళిపూడి దర్శకుడు. కేసనకుర్తి శ్రీనివాస్ నిర్మాత. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. మదర్స్ డే సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'అమ్మా..' అంటూ సాగే ఈ సినిమాలోని పాటను ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత విడుదల చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. అమ్మ ప్రేమను చాటి చెప్పేలా హృద్యంగా ఈ పాటను చిత్రీకరించడం జరిగిందని దర్శక, నిర్మాతలు తెలిపారు. మధుకిరణ్ రాసిన ఈ పాటను ప్రజ్వల్ క్రిష్ స్వరపరచగా స్నిగ్ధ నయని ఆలపించారు. ఇంకా నిర్మాత ఈశ్వర్‌బాబు, హీరో రోహిత్, దియా రాజ్, రిహానా, కల్పిక, బాలనటుడు గుడ్డు, సింగర్ సిగ్ద, ఇనయ సుల్తానా, తదితరులు మాట్లాడారు.



# నీమాటే నచ్చే.. మది మరుమల్లె విచ్చే..




డా.రాజేంద్రప్రసాద్, అర్చన ముఖ్య తారలుగా, రూపేష్, ఆకాంక్షసింగ్ జంటగా.. పవన్ ప్రభ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'షష్టిపూర్తి'. మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఇళయరాజా ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే ఈ సినిమాలోని రెండు పాటలను మేకర్స్ విడుదల చేశారు. ఈ క్రమంలోనే ఆదివారం మూడో పాటను విడుదల చేశారు. 'రాత్రంతా రచ్చే.. మరి నువ్వంటే పిచ్చే.. నీమాటే నచ్చే.. మది మరుమల్లె విచ్చే..' అంటూ సాగే ఈ పాటను చైతన్యప్రసాద్ రాయగా యువన్‌శంకర్‌రాజా, నిత్యశ్రీ ఆలపించారు. ఈ సందర్భంగా యువన్ శంకర్‌రాజా మాట్లాడుతూ 'మా నాన్న సంగీత దర్శకత్వంలో ఈ తెలుగు పాట పాడినందుకు ఆనందంగా ఉంది. తెలుగులో నేను పాడిన తొలి పాట ఇది. ఇది చాలా కూల్ సాంగ్. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది.' అని తెలిపారు. యువన్ ఈ పాటను అద్భుతంగా పాడారని, ఇప్పటివరకూ విడుదలైన రెండు పాటలు ఒకెత్తయితే.. ఈ పాట మరో ఎత్తని, ఫుల్ రొమాంటిక్ జోష్‌లో ఈ పాట ఉంటుందని, కళాదర్శకుడు తోట తరణి ఈ పాట కోసం నాలుగు సెట్లు వేశారని దర్శక, నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రామ్.

# వినూత్నంగా వైభవం



రుత్విక్, ఇక్రా ఇద్రిసి జంటగా రూపొందిన చిత్రం 'వైభవం'. సాత్విక్ దర్శకుడు. నూతన నిర్మాణ సంస్థ రమాదేవి ప్రొడక్షన్స్ పతాకంపై సినిమా రూపొందింది. సెన్సార్ క్లీన్ యూ సర్టిఫికెట్‌ను పొందిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఎంతో మంది ప్రతిభావంతులైన నటీనటుల్ని ఈ సినిమా ద్వారా పరిచయం చేస్తున్నామని, అద్భుతమైన కథ, కథనాలతో సినిమా ఉంటుందని, అందరికీ నచ్చే సినిమా అవుతుందని మేకర్స్ చెబుతున్నారు.

# విభిన్నమైన కథాంశంతో ప్రేమిస్తున్నా



సాత్విక్ వర్మ, ప్రీతి నేహా జంటగా, భాను దర్శకత్వంలో కనకదుర్గారావు పప్పుల నిర్మిస్తున్న చిత్రానికి 'ప్రేమిస్తున్నా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇంతవరకూ ఎవరూ టచ్ చెయ్యని ఒక డిఫరెంట్ పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని, యూత్ మళ్లీ మళ్లీ చూడాలనుకునే ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉంటాయని మేకర్స్ తెలిపారు. సిద్ధార్థ్ సాలూరి సంగీతం, భాస్కర్ శ్యామల సినిమాటోగ్రఫీ ఈ సినిమాకు పిల్లర్స్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: అనిల్‌కుమార్ అచ్చుగట్ల, నిర్వహణ: మల్లి రవికుమార్, సమర్పణ: వరలక్ష్మీ పప్పుల.